# వేదాంతభేరి

ఏప్రిల్ 2020

రూ. 10/-

Scanned with CamScanner

# ఓం వేదాంతభేరి ఓం


సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 53 ఏప్రిల్ 2020 సంచిక : 04

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,


శాశ్వత పోషక చందా రూ. 2000/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు ) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.


Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.

Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI





Scanned with CamScanner

# ॐ వేదాంతభేరి ॐ

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 53 ఏప్రిల్ 2020 సంచిక : 04


## విషయ సూచిక


01. ప్రార్థన - 05
02. అభయ ప్రాప్తి - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు -06
03. సద్గురు సుభాషితాలు - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 10
04. శ్రీ గురు శ్శరణం మమ - శ్రీ స్వామి విద్యాస్వరూపానన్ద - 12
05. సాధన పంచకము 2వ శ్లోకము
- శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 13
06. గీతామకరంద ప్రదాత - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - 17
07. రామాయణంలో శ్రీరాముడు చెప్పిన బోధ
- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు - 22
08. మాధవ నామ మాధుర్యము
-బ్రహ్మీభూత నర్వేశ్వరానందగిరి స్వాములవారు - 27
09. ఉద్దవ గీత - శ్రీ యేలేశ్వరపు హనుమ రామకృష్ణ - 30
10. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడు గురుదేవులు - డా॥ తారాలక్ష్మి - 37
11. భగవంతునికి ఇష్టమైనవారు గురుదేవులు - కె. ఈశ్వర్ - 39
12. వార్తలు - 42


ముఖచిత్రం - పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఏప్రిల్ 2వ తేది శ్రీరామనవమి

ఏప్రిల్ 4వ తేది శ్రీమలయాళస్వాములవారి జయన్తి

ఏప్రిల్ 7వ తేది శ్రీవిద్యా ప్రకాశానందగిరి స్వామివారి ఆరాధన

ఏప్రిల్ 10వ తేది శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి జయన్తి

ఏప్రిల్ 28వ తేది శ్రీ శంకరాచార్యుల జయన్తి

ఏప్రిల్ 29వ తేది శ్రీరామానుజాచార్యుల జయన్తి


ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు




## ప్రార్థన

ఓమ్ నమో భగవతే శ్రీరామాయ పరమాత్మనే ।
సర్వభూతాంతరస్థాయ ససీతాయ నమో నమః ॥

ఓమ్ నమో భగవతే శ్రీరఘునాథాయ శార్ఙ్గిణే ।
చిన్మయానంద రూపాయ ససీతాయ నమో నమః॥

ఓమ్ ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥

ఓమ్ శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘువరాన్వయ రత్నదీపమ్ ।
ఆజానుబాహు మరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి ॥

ఓమ్ మనోభిరామం నయనాభిరామం
వచోఽభిరామం శ్రవణాభిరామమ్ ।
సదాఽభిరామం సతతాభిరామం
వందే సదా దాశరథిం చ రామమ్ ॥

ఓమ్ వైదీహీ సహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితమ్ ।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్ ॥

ఓమ్ రామో మత్కుల దైవతం సకరుణం రామం భజే సాదరమ్ ।
రామేణాఖిల ఘోరపాపనిహతీ రామాయ తస్మై నమః ॥




Scanned with CamScanner

# అభయప్రాప్తి

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

భగవదాశ్రయముచే మానవునకు నిర్భయత్వము చేకూరగలదు.

తస్మాద్భారత సర్వాత్మా భగవాన్ హరిరీశ్వరః ।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛతా భయమ్ ॥ (భాగవతము 2-1-5)

"అభయమును గోరువాడు సర్వస్వరూపుడును ఈశ్వరుడునగు శ్రీహరినే కీర్తింపవలెను. అతనినే స్మరింపవలెను. ఆతనిని గూర్చియే వినవలెను." అని శుకులవారు ఆనతిచ్చిరి.

సంసార దుఃఖరాహిత్యమును గోరువాడు, భయరాహిత్యమును కాంక్షించువాడు త్రికరణములతోటి భగవత్సేవ జేయవలెను. తాను వినునది యంతయు దైవమును గూర్చినదిగనే యుండవలయును. తలంచున దంతయు దైవ సంబంధమైనదిగా నుండవలయును. పలుకునదంతయు దైవ (సంబంధ) వాణిగనే యుండవలయును. దైవమున కన్యములగు దృశ్య జాతములన్నియు అసత్యములు, నశ్వరములు. అవి అజ్ఞానమును అభివృద్ధి జేసి, మోహమును పెంచి జననమరణ రూప సంసార బంధమును గలుగజేయును. కావున అవి భయస్థానములగు చున్నవి. కనుకనే భర్తృహరి "భోగములందు రోగభయము, బలమునందు తనకంటె బలవంతుడగు శత్రువును గూర్చిన భయము, మంచిరూపమునందు ముసలితనము వచ్చునని భయము, ధనమునందు రాజులు పన్నులు వేయుదురని భయము"- ఈ ప్రకారముగ "సర్వం వస్తు భయాన్వితం భువి నృణామ్" సమస్త దృశ్య పదార్థములందును భయము కలదని



నుడివియున్నారు. మఱియు శ్రుతియు "ద్వితీయాద్వై భయం భవతి" అని వచించినది. అనగా పరమాత్మ కన్యమగునది ఉన్నదని నమ్మిన వెంటనే భయమావరించుచున్నదని భావము. ఒక్క పరమాత్మయే అభయస్వరూపుడు. కావుననే శ్రుతియందు "అభయం వై జనక ప్రాప్తోసి" అనుచోట పరమాత్మకు అభయమని పేరు చెప్పబడినది. ఆ పరమాత్మ సత్యము, నిత్యము కావున నాశరహితమైనది. ఆనందఘనము కావున శోకరహితమైనది. ఏకము కావున అపరిచ్ఛిన్నమైనది. కనుకనే దానికి అభయమను పేరు సార్థకమైనది. అందుచే అభయమును గోరువాడు అట్టి నిత్యసత్య ఆనంద అభయస్వరూప పరమాత్మనే, శ్రీహరినే ఆశ్రయించవలయును. ఆ పరమాత్మ సర్వస్వరూపుడు - అతడు లేని చోటే లేదు. కావున సర్వము ఆతనియందున్నది. ఈ విషయమునే భగవానుడు గీతలో "సర్వాణి భూతాని మత్థానీత్యుపధారయ", "మయా తత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా" అని చెప్పియున్నాడు. ఇంకను ఆ పరమాత్మ ఈశ్వరుడు అనగా శాసకుడు -సర్వనియంత. అంతయు అతని ఆజ్ఞకు లోబడినదే. ఆతనిని ఆజ్ఞాపించువాడు లేదు. అతడు "అణోరణీయాన్ మహతో మహీయాన్"- మహచ్ఛక్తి సమన్వితుడు కావున అతనికి మించినది లేదు. సర్వమును మించిన వాడాతడే. "భయాదస్యాగ్ని స్తపతి భయాత్తపతి సూర్యః, భయాదింద్రశ్చ వాయుశ్చ, మృత్యుర్ధావతి పంచమః" అను శ్రుతియు ఈ పరమాత్మకు లోబడియే అందఱును తమ పనులు జరుపుకొనుచున్నారని తెలిపినది.

కావున శ్రీహరికి (భగవానునికి) సర్వాత్మ, ఈశ్వరుడను విశేషణము లెంతేని తగియున్నవి. ఇట్టి సర్వాత్మ,ఈశ్వరుడునగు భగవంతుని సేవించువానికి సంసార దుఃఖ భయమెట్లుండును? అయితే యీ భయరాహిత్యమునకు శ్రీహరిని సేవించు విధాన మెట్టిదనిన - ఆ భగవంతునే కీర్తించుట,స్మరించుట,



Scanned with CamScanner

వినుట కావించవలెను. "తచ్చింతనం తత్కథనం,అన్యోన్యం తత్ప్ర బోధనం". దీనినే బ్రహ్మాభ్యాసమని శాస్త్రము చెప్పినది.

ఇంద్రియములకెల్ల నాయకుడు మనస్సు. ఆ మనస్సు ఎటుపోయిన మిగిలిన జడములగు ఇన్ద్రియములు దాని ననుసరించును. కావున మనస్సు ప్రపంచమును వీడి భగవంతునే స్మరించినచో ఆ రూపమునే పొందును. మనస్సులో ఏ చింతనలు, ఆలోచనలు ప్రబలములుగ నుండునో ఆ భావనలు అధికమై తత్సంబంధవాక్యములే అధికముగా వచ్చుచుండును. కావున జనులు నిరంతరము మనస్సుచే భగవంతుడినే స్మరించుచుండవలయును. అట్లు నిరంతర భగవత్స్మరణచే, ధ్యానముచే మనస్సు తద్రూపతనొందును. అట్టియెడ వాక్కునందును ఆ భగవత్కథలే వచ్చుచుండును. గోపికలు సదా శ్రీకృష్ణస్మరణ, ధ్యానము చేయుటంబట్టియే గదా నగరమున పెరుగు అమ్మబోయియు శ్రీకృష్ణస్మరణ చిత్తలై పెరుగు పెరుగు, అని అరచుటకు బదులు "గోవింద! దామోదర ! మాధవ!!"యని బజారున అరచిరి. అయితే మాయ, ప్రాక్తనవాసనలు జనులయొక్క చిత్తమును మరల మరల ప్రంచమునైపులాగుచుండును. దానిచే దైవస్మరణయందు ఏమరుపాటు, సోమరితనము గల్గును. కావున ఆ ప్రమాదము నుండి వేలుకొనవలయుననిన మాటిమాటికి దైవకథాశ్రవణము జరుగుచుండవలయును. శ్రవణముద్వారా వినిన విషయము లోన మనస్సుపై ప్రతిబింబించి అట్టి ఆలోచనలందే ముంచును. సదా దైవస్మరణ యుండవలెననిన శ్రవణము చేయునది దైవ చరిత్రలుగనే యుండవలయును. ఆ కథలనే ఇతరులకు చెప్పుచుండవలయును. అపుడు మానసికముగా చింతనము దైవసంబంధముగా జరుగుటకు వీలుండును. శ్రీహరి సంబంధ కార్యములే చేయుటచే మనస్సు అట్టి ఆలోచనలందే నిలుచును. అట్టియెడ శ్రీహరిస్మరణ కేలాటి అంతరాయము లేక మరింత



దృఢముగా జరుగును.

ఈ ప్రకారముగ భగవద్వాక్య (భగవన్నామ) ప్రబోధము, భగవత్కథాశ్రవణము, భగవత్స్మరణ (ధ్యానము) చేయుటచే మనస్సు భగవదాకారమును పొందును. కీటము భ్రమరమును (తుమ్మెదను) గూర్చియే చింతించుటచే భ్రమరముగా మారునట్లును, నీరు ముత్యపు చిప్పలోబడి ముత్యమగునట్లును, ఉప్పు నీటిలోబడి తనస్వరూపమును వీడి నీటిలో కలసిపోవునట్లును, ఇనుము నిప్పులోబడి నిప్పుగా యగునట్లును మనస్సున్ను దైవస్మరణచే తన ప్రాపంచిక రూపమును వీడి దైవరూపములో లీనమగును. అపుడు అమనస్కతగల్గి దైవము మాత్రము శేషించును. ఆ ఏకమైన, అద్వితీయమైన నచ్చిదానందాత్మానుభూతిలో ఇక భయ మెచట? అచలమైన, నిశ్చలమైన పరమాత్మలో తాను లీనమగుచుండ ఇక సంసార మెచట? ఆనంద సముద్రములో తాను లీనమగుచుండ ఇక సంసార దుఃఖ మెచట? కావుననే సంసార దుఃఖమునుండి విరక్తినొంది అభయమును గోరువారు శ్రీహరినే స్మరించుడు, కీర్తించుడు, శ్రవణము చేయుడు అని శ్రీశుకులవారు చెప్పిరి. కావున ఈ క్షణమునుండియే జనులు సర్వాంతర్యామి, సర్వశాసకుడు భగవంతుడనగు శ్రీహరినే స్మరించి భగవదాయత్త చిత్తులై, ఆనందంతో చిందులు ద్రొక్కుచు "హరేరామ హరేకృష్ణ, రాధే గోవింద" అని కీర్తించుచు సంసార భయమును వీడి పాపరహితులు కావలయును.

---

**1. ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించాలనుకొనే సాధకులు భగవద్ధ్యానశీలురైన మహాత్ముల, భగత్సాక్షాత్కారం పొందిన మహనీయుల మాటలను విశ్వసించాలి.**

**2. ఆధ్యాత్మిక మార్గం పదునైన కత్తి అంచులా నిశితమై, ఎన్నో అవరోధాలతో నిండి వుంటుంది. అయినా నిస్పృహ చెందకండి. లేవండి మేల్కొనండి. గమ్యం చేరే వరకు విశ్రమించకండి. - శ్రీరామకృష్ణ పరమహంస**



Scanned with CamScanner

# సద్గురు సుభాషితాలు

**– శ్రీ మహర్షి మలయాళస్వాములవారు**

ఒక్కడు తన ప్రభువును ఎక్కువగా ప్రేమించుచున్నాడు. అయితే ప్రభువు యొక్క ఆజ్ఞను యెక్కువ ప్రేమించుటలేదు. మరియొక్కడు ప్రభు శాసనమునే ఎక్కువగా ప్రేమించుచున్నాడు. ప్రభువును యెక్కువ ప్రేమించుటలేదు. వీరిద్దరిలో యెవడు గొప్పవాడు ? అదేరీతిగా ఒక్కడు దైవమునుగాని గురువునుగాని యెక్కువగా ప్రేమించుచున్నాడు. కాని దైవశాసనమునుగాని, గురు ఆశయమునుగాని యెక్కువగా ఆదరించుట లేదు. ఇంకొక్కడు దైవమునుగాని, లేక గురువునుగాని యెక్కువగా ప్రేమించేలాగున నటించుటలేదు. అయితే దైవాజ్ఞను గురుశాసనమును యెక్కువగా ప్రేమించి తనయొక్క జీవితమంతయు దానిలో వినియోగ పరచుచున్నాడు. వీరిద్దరిలో యెవరు గొప్పవారు? ఇదే అంతరంగభక్తియొక్కయు, సామాన్య భక్తియొక్కయు గురుతుగా యుండును.

ఎల్లప్పుడు రాత్రిగాని, లేక పగలుగాని, లేక వర్షాకాలముగాని, లేక యెండాకాలము గాని యుండిన లోకములో ఒక్కప్రాణిగాని, ఒక్క తృణముగాని బ్రతుకజాలదు. ఆలాగున ఓ సాధకుడా ! ఎల్లరు నిన్ను స్తోత్రము చేయవలెనని తలంపకుము. అట్లైన నీకు ఆత్మైక్య జ్ఞానము వృద్ధిగానేరదు. అంతేగాక ప్రమాదమునకు కారణము మెండుగగల్గును. నిందించుట నీకు అభివృద్ధికి కారణమగును. అయితే నిందించుటకు కారణమేమియు నీయందుండరాదు. ఉండిన చెడును. ఇది నిజము.

సాధకునికి ఎంతవరకు స్వరూపస్థితిలో అనగా దైవాత్మైక్యత్వనిష్ఠలో సుస్థిరత గలుగలేదో, అంతవరకు అట్టి సాధకుని స్థితి చుక్కానిలేని పడవ చందంబునను, దారము తెగిపోయిన గాలిపటము రీతిగాను, నిలకడయును, దైవసౌఖ్యమును పొందక మనస్సు పోయెడు మార్గముగా పోయి అశాంతియును, మనఃక్షోభమును పొందుచు వ్యథల నొందుచుండును.

ప్రారబ్ధానుభవము జ్ఞానికిని, అజ్ఞానికిని ఒకేవిధముగనే గల్గుచుండినను, ఇట్టి భేదముగలదు. అజ్ఞానియొక్క ప్రారబ్ధము కారుచీకటిలో వెలుగుచుండు దీపమువలె నుండును. జ్ఞానియొక్క ప్రారబ్ధము మంచి ఎండలో బెట్టిన దీపమువలెనుండును. దీపము చీకటిలోను ఎండలోను ఒకేవిధముగా నుండినను, రాత్రిలో దీపము బాగుగ ప్రకాశవంతమై యుండును. మంచి ఎండలో దీపము వెల్గుచుండినను, సూర్యరశ్మి మహిమచే గనపడదు. ఆలాగున జ్ఞానికి ఆత్మజ్ఞానశక్తి సుఖముచే కర్మము గోచరింపదు. అజ్ఞానికి జ్ఞానప్రకాశము లేనందుచే కర్మ ఎక్కువ గోచరించుటచే నతడు దుఃఖితుడగును.

## వేదాన్తభేరి చందాదారులకు విజ్ఞప్తి

వేదాన్తభేరి సంవత్సర చందా జనవరి నుండి డిశంబరు వరకు సంవత్సరంగా స్వీకరించబడును. గత సంవత్సర చందా పూర్తి అయిన వారిలో కొందరు ఇంకనూ చందా పంపలేదు. అట్టివారు వెంటనే తమ చందా పంపగోరుచున్నాము. చందా రానివారికి పత్రిక ఆపి వేయబడును.

జీవిత చందా L దారులకు ఇదివరలో ప్రకటించిన ప్రకారం 2020 డిశంబరు సంచికతో పత్రిక ఆపివేయబడును. పోషక P చందాదారులకు మాత్రం పత్రిక ఎప్పటికీ పంపబడును. జీవితచందా ఇకపైన వుండదు. ఇంతవరకు జీవిత L చందా కట్టియున్నవారు ఇప్పుడు రూ.1500/-లు పదిహేను వందల రూపాయలు మరల పంపితే వారిని పోషక P చందాదారులుగా గుర్తించి వారికి పత్రిక సదా పంపబడును.

ఇట్లు

25-03-2020 పబ్లిషర్స్, వేదాన్తభేరి





Scanned with CamScanner

# శ్రీగురు శ్శరణం మమ

**– స్వామి విద్యాస్వరూపానన్ద**

ప్రజానీకానికి, సర్వోన్నతమైన గీతాజ్ఞానాన్ని అందించడానికే మీ జీవితాన్ని అంకితం చేసిన గురుదేవా! శ్రీ విద్యాప్రకాశా! 'నమోనమః'. 'స్వయం తీర్ణః పరాంతారయతి' అను ఆర్యోక్తి ననుసరించి గురుసన్నిధిలో ఏకాంతంగా పన్నెండు సంవత్సరాలు తనస్సు చేసి మీరు తరించినదే గాక ఆ తరువాత 40 వసంతాలు అలుపెరుగక ఆంధ్రదేశమంతా మీరు బడసిన జ్ఞానామృతాన్ని గీతామృతాన్ని ప్రజలకు వెదజల్లిన మీ ముముక్షు జనసేవ అభినందనీయము. మీ ఉపదేశామృతం త్రావి వేలకొలది జనులు ఆనందాబుధిలో మునకలు వేసి తరించిరి. ఇట్టి మీ జ్ఞానవితరణకు జోహార్లు.

నడయాడే పరబ్రహ్మమా ! భాగవతంలో 'నారాయణస్య ద్వేరూపే చలం అచలమేవచ! చలం సన్న్యాసినో రూపం అచలం ప్రతిమాదికం' అన్నట్లు మీరు నిజమైన సన్న్యాసులై పవిత్ర ఆచరణతో నడియాడే – నడచే నారాయణులై మీ దర్శన, స్పర్శన భాగ్యంతో మమ్ములనందరిని పవిత్రులను చేశారు. దానిచే మేము కృతార్థులయినాము, చరితార్థు లయినాము. సఫల జీవులమైనాము. అట్టి "గురుస్సాక్షాత్ పరబ్రహ్మ"అన్నట్లు పరబ్రహ్మ స్వరూపులైన మీకు శరణం ! శరణం.

భవ్య స్వర్ణముఖీ తటస్థిత శుకబ్రహ్మాశ్రమ స్థాపకం
గీతా తత్త్వనిరూపకం యతివరం విద్యాప్రకాశాహ్వయమ్ ।
ధ్యాత్వా శ్రీమలయాళ సద్గురు కృపాపాత్రం పవిత్రం గురుం,
బద్ధేనాంజలినా నతేన శిరసా నమామి శ్రీ సద్గురుమ్ ॥

# సాధన పంచకము – 2వ శ్లోకము

**– శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు**

**( గత సంచిక తరువాయి )**

సంగస్సత్సు విధీయతాం భగవతో భక్తిర్దృఢాధీయతామ్ ।
శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాశు సన్త్యజ్యతామ్ ।
సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకే సేవ్యతామ్ ।
బ్రహ్మైవాక్షర మర్థ్యతాం శృతిశిరోవాక్యం సమాకర్ణ్యతామ్ ॥

సజ్జనుల సహవాసమును చేయవలెను. భగవంతుని యందు నిర్మలమైన దృఢభక్తి గలిగియుండవలెను. శమదమాదులను శీలించవలెను. పటుతరమైన కర్మబంధమును తొలగించుకొనవలెను. ఆచార్యులైన శ్రోత్రియ బ్రహ్మ నిష్ఠుల సన్నిధి నాశ్రయించవలెను. వారి దివ్య పాదకమలములను ప్రతిదినం సేవించవలెను. పరబ్రహ్మ స్వరూపమును గూర్చి చెప్పమని కోరవలెను. వేదాంతములైన ఉపనిషద్వాక్యములను ఏకాగ్రబుద్ధితో శ్రవణము చేయవలెను అని ఈ శ్లోకము యొక్క సంగ్రహ భావము.

సంగస్సత్సు విధీయతాం

సజ్జన సాంగత్యము చేయవలెను. సత్వగుణ సంపన్నులతో సహవాసము చేసిన సత్వగుణమధికముగా అభివృద్ధి చెంది రజోగుణ తమోగుణ భావములు నశించును. ఇతరులను హింసించుట, దూషించుట, నిందించుట, కొండెములు చెప్పుట మాని వేయుదురు. పరోపకారము ధర్మనిష్ఠ, అహింసాదులు మొదలగు సద్గుణము లలవడును. మనస్సు



Scanned with CamScanner

ప్రశాంతమగును. జపధ్యానములయందు మనస్సు స్థిరమగును. స్వకర్మనిష్ఠయందు ఉత్సాహమును పొందును. పరమ పురుషార్థ సాధనమగు మోక్షవిషయములో విచారణకు యోగ్యమైన బుద్ధి గలుగును. సజ్జన సాంగత్యముచే ఈ ఉత్కృష్ట విషయములన్నియును పొందును. "సతాంహి సంగః సకలం ప్రసూతే" సత్పురుషుల సహవాసం సమస్తాన్ని చేకూరుస్తుందని మహాశయుడగు భర్తృహరి చెప్పారు.

"త్రిజగతి సజ్జన సంగతి రేకా భవతి భవార్ణవతరణే నౌకా " అని శాస్త్రము– మూడు లోకములలో సజ్జన సాంగత్య మొక్కటే సంసారమును తరించుటకు ఓడయని చెప్పుచున్నది. సత్సంగము వల్లనే జీవన్ముక్తి రూపమైన మోక్షము సిద్ధింస్తుందని శ్రీశంకర భగవత్పాదులవారే చెప్పిరి. అందువలన కైవల్యమును సాధించుటకు సత్సంగమొక సాధనగా చెప్పిరి.

భగవతో భక్తిర్దృఢాధీయతామ్

సత్సంగ మహిమతో సద్రూపుడైన పరమాత్మ విజ్ఞానము గలుగగా అటువంటి బ్రహ్మయందు దృఢ భక్తి గలుగుటకై ఈ సాధన చెప్పబడుచున్నది. భక్తియనగా – "సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా" అని నారదుల వారు చెప్పిరి. కరుణామూర్తియగు భగవంతుని యందుగల అపారమైన ప్రేమకు భక్తియని పేరు. మిక్కిలి ప్రీతినే భక్తియందురు. బిడ్డలయందు తల్లిదండ్రులకుండు ప్రీతిని, శిష్యులయందు గురువులకుండు ప్రీతిని వాత్సల్యమందురు. పరస్పరము భార్యయందు, బంధుమిత్రాదుల యందున్న ప్రీతిని ప్రేమయందురు. తల్లిదండ్రులయందు, గురువుల యందుండు ప్రీతిని భక్తి యందురు. ధ్యేయవస్తువైన రామ, కృష్ణ, దేవి, దేవతల యందున్న, మరియు స్వస్వరూపమైన పరమాత్మ యందున్న పరమ ప్రీతిని భక్తియందురు. దృఢతరమైన భక్తి ఏవిధముగా నుండవలయునో శివానందలహరిలో



శ్రీ శంకరులవారు ఈ విధముగా వర్ణించిరి.

"అంకోలం నిజబీజసంతతి రయస్కాంతోఫలం సూచికా॥
సాధ్వీనైజవిభుం లతాక్షితిరుహం సింధుస్సరిద్వల్లభమ్ ।
ప్రాప్నోతీహ యథాతథా పశుపతేః పాదారవిందద్వయమ్।
చేతోవృత్తి రుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే " ॥

ఊడుగ చెట్టునుండి విడివడిన విత్తనములు మన ప్రయత్నము లేకుండానే మరల చెట్టు మొదలకే చేరుకొన్నట్లు, అయస్కాంత సన్నిధిలో నున్న సూది అప్రయత్నముగా కదులుచూ దానివైపుకే ఆకర్షింపబడునట్లు, పతివ్రతయైన స్త్రీ స్వభర్తనే సదాచింతించునట్లు (సతీ అనసూయ, సతీసుమతి, సతీసావిత్రి మొదలగు వారివలె), లత వృక్షమునే ఆశ్రయించునట్లు, నది ఇతరములగు వానిని చూడక సముద్రమునే పరమ గతిగా పతిగా భావించి పరుగున చేరునట్లు, ఈపైన వివరించుకొనిన రీతిగా చరాచరములన్ని తదేక ధ్యానముతో తన ధ్యేయమును అనాయాసముగ పొందుచున్నవో, ఆ విధముగా ఎవని మనస్సు ఆ భగవంతుని యందు, లేదా స్వస్వరూపమైన పరమాత్మయందు లీనమగు చుండునో అట్టి మనోవృత్తిని (చిత్తవృత్తిని) దృఢభక్తియని భగవత్పాదుల వారు చెప్పారు.

సుఖదుఃఖము లెన్ని గలిగినను ధ్యేయము వదలిపెట్టక విచారణ ద్వారా నిర్ణయమైన తత్త్వము నందు నిలకడ గలిగియుండుటే నిజమైన భక్తి. సక్కుభాయి, గోపికలు, శ్రీకృష్ణచైతన్య ప్రభు, శ్రీరామకృష్ణ పరమహంస, మహర్షి శ్రీ మలయాళస్వాములవారు, శ్రీ రమణ మహర్షి, శ్రీ శివానంద స్వాములవారు, ఆంజనేయులు, నంది, సమర్థ రామదాసు, భక్తతుకారాం మొదలగు భక్తమహనీయులెందరో, ఎన్నో శ్రమలకోర్చి, ఎన్ని కష్టములు ప్రాప్తించినను లక్ష్యమును వీడక స్వస్వరూపానుసంధాన తత్పరులై తాము

తరించి, అనేకమందిని తరింపజేసిరి. భక్తుల, మహనీయుల చరిత్రములను చదువుచుండిన దృఢ భక్తి అలవడును. "మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ। స్వస్వరూపానుసంధానం భక్తి రిత్యభీధీయతే" అని వివేక చూడామణిలో శ్రీశంకరులవారు ఉదాహరించిరి. శాస్త్రములలో మోక్షమునకు సాధనములుగా నేవేవి చెప్పబడినవో, వాటన్నింటిలో భక్తియే శ్రేష్ఠమైనది. అపాయరహితమైనది. ఆయాసములేనిది. నిత్యనైమిత్తిక కర్మలకు జీవన విధానమునకు అవరోధము అనగా అడ్డు గలిగించునదీ కాదు ఈ భక్తి. ఆ భక్తి అనగానేమిటో తెలుపుచున్నారు. సత్సంగము ద్వారా, సచ్ఛాస్త్రముల ద్వారా, సద్గురువుల ద్వారా, విచారణా ద్వారా పరమాత్మ కంటె భిన్నమైనది, అన్యమైనది మరొకటి లేదని, ప్రతి వస్తువులోను, ప్రతి అణువులోను పరమాత్మ వ్యాపించి యున్నాడని, ఈ నామ రూపాత్మకమైన జగత్తుకు ఆధారుడతడేనని, దేవతా కోటిలోను, పశుకోటిలోను, మానవులందరిలో నున్న పరమాత్మ ఒక్కడేనని, అతడే నేనని, అహం బ్రహ్మాస్మి, బ్రహ్మైవాహమస్మి యని బుద్ధి ద్వారా దృఢ నిశ్చయము చేసుకొని, నిరంతరము స్వస్వరూపమగు పరమాత్మ ననుసంధించుటయే భక్తియని శ్రీ శంకరులు చెప్పిరి. శివభక్తులైనను, విష్ణు భక్తులైనను, దేవి భక్తులైనను. మరే దేవత భక్తులైనను నా దేవుడు గొప్పవాడు, నీ దేవుడు తక్కువవాడని ఇతర దేవతలను దూషించువాడు, కన్నెత్తైన చూడనివాడు నిజమైన భక్తుడు ఎన్నడూగాడు. "మద్భక్తః శంకరద్వేషీ మద్ద్వేషీ శంకర ప్రియః। తావుభౌ నరకం యాతో యావచ్చన్ద్ర దివాకరౌ"॥ విష్ణు భక్తుడై శివద్రోహియైనను శివభక్తుడై విష్ణుద్రోహియైనను ఆ యిరువురును సూర్యచంద్రులున్నంత కాలము నరకమందుందురు అని విష్ణు పురాణము. తనదైవమును ప్రేమించి అందరిలో నున్న వాడు తనదైవమేనని భావించి. అందరిని ప్రేమించుటయే అవ్యభిచారిణీ భక్తి అనబడును.

# గీతా మకరంద ప్రదాత

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

'కాలః క్రీడతి గచ్ఛత్యాయుః' (భజగోవిందం) అని శ్రీ శంకర భగవత్పాదులున్నారు. కాలం ఒక నిమిషమైనా ఊరకుండక తన గమనం నిర్విరామంగా కొనసాగిస్తున్నది. ప్రాణికోట్లతో అది ఆటలాడుకొంటున్నది. దాని ప్రభావం వల్లనే జీవుల ఆయువు క్షణక్షణానికీ తరిగి పోతున్నది.

రానున్న ఏప్రిల్ నెల 7వ తేదికి గీతామకరందప్రదాత పూజ్యశ్రీ విద్యాప్రకాశానందస్వాములవారు భౌతికకాయం పరిత్యజించి 22 సంవత్సరాలు పూర్తికానున్నాయి. అట్లే ఆ నెల 10వ తేదీన వారి జయంత్యుత్సవం జరుగనున్నది.

కాలగతిని ఎవ్వరూ ఆపలేరు. "కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధః లోకాన్ సమాహర్తు మిహప్రవృత్తః" అని గీతాచార్యుడు కాలాన్ని తన స్వరూపంగా అభివర్ణించాడు.

పుట్టే జీవులు కొంతకాలానికి గిట్టే జీవులవుతున్నారు. ఇది ఒక భగవల్లీల. భగవంతుడు జగన్నాటక సూత్రధారుడు కదా !

అన్నమాచార్యులవారు - "నానాటి బ్రతుకు నాటకము" అని జీవితాన్ని ఒకనాటకంగా అభివర్ణించారు. ఈ నాటకంలో నటులుగానే మిగిలిపోక ఆనాటి నుండి పూర్తిగా నివృత్తిని పొందాలి. ఆ నివృత్తినే కైవల్యమన్నారు. అది ఏ కొందరికో అరుదుగా ప్రాప్తిస్తుంది. అందుకే అన్నమయ్య "కానక కన్నది కైవల్యము"ప్రతి యుగంలోనూ మహాపురుషులు కొందరైనా ఉద్భవిస్తూనే వుంటారు. వారు కైవల్యం తాము పొందడమేకాక,

ఇతరులకు గూడా కైవల్య ప్రాప్తి మార్గాన్ని చూపిస్తారు. అట్టివారి నుద్దేశించియే శంకరులు.

"తీర్ణాః స్వయం భీమ భవార్ణవం జనా

న హేతునాఽన్యానపి తారయన్తః " (వివేక చూడామణి) అని చెప్పారు. అంటే భీకరమైన సంసార సాగరాన్ని వారు తరించి ఇతరులను గూడా నిర్హేతుక కృపతో తరింపజేస్తారని భావం.

అట్టి మహనీయుల కోవకు చెందినవారే శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారు. శ్రీమలయాళ సద్గురు దేవుల శిష్యులుగా, శ్రీ శుకబ్రహ్మాశ్రమ ప్రతిష్ఠాపకులుగా, అనేక గీతాయజ్ఞ నిర్వాహకులుగా, గీతామకరంద ప్రదాతగా వారు సాటిలేని కీర్తి ప్రతిష్ఠలను పొందారు.

భగవంతుడు ధర్మోద్ధరణకై తాను అవతరించాలనుకొన్నప్పుడు తనకు తోడుగా మరికొందరు దైవాంశ సంభూతులను తీసికొని వస్తాడని పురాణాలు ఘోషిస్తున్నాయి. అలా తన జీవితాన్నే గీతాభాష్యంగా తీర్చిదిద్దుకున్న చరాచర సుఖాభిలాషి శ్రీ మలయాళస్వాములవారికి ముఖ్య శిష్యులుగా, వారి కత్యంత ప్రియమైన భగవద్గీతను అనన్య సామాన్యమైన రీతిలో ప్రచారం చేసిన మహానుభావులుగా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు వెలుగొందారు. శ్రీ మలయాళస్వాములవారి ఆధ్యాత్మిక ప్రచారోద్యమాన్ని లక్షలకొలది ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చారు.

శంకరులు గీతకు భాష్యం వ్రాస్తూ "తదిదం గీతాశాస్త్రం సమస్త వేదార్థసార సంగ్రహభూతమ్ " అని చెప్పారు. అనగా గీతాశాస్త్రం సకల వేదార్థాల సార సంగ్రహమని భావం. వేదంలో లాగానే గీతలో గూడా కర్మ-భక్తి-ధ్యాన- జ్ఞానయోగాలు ప్రతిపాదింపబడి వున్నాయి. వేద సర్వస్వమూ 700 శ్లోకాలలో ఇమిడ్చిన ఘనత నారాయణాంశ



సంభవుడైన వేదవ్యాసునికి దక్కింది.

అట్టి గీతను కొన్ని జాతులకు చెందిన వారూ, స్త్రీలూ చదువరాదన్న మూఢవిశ్వాసం ప్రబలంగా వున్న కాలంలో ఆ దుర్వాదాన్ని ఖండించి అనేక ప్రబల ప్రమాణాలతో జిజ్ఞాస గలవారందరూ గీతాపఠనం చేయవచ్చు అని నిరూపించినవారు శ్రీమలయాళస్వాములవారు. శ్రీవారి సదాశయాన్ని తన నిరర్గళవాగ్ధోరణితోనూ, వివిధ గీతాయజ్ఞాల నిర్వహణతోనూ, విశేషించి "గీతామకరంద' రచనతోనూ, ఫలప్రదం కావించినవారు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు.

వారు గీతకు కావించిన అతి విపులమైన వ్యాఖ్యాన గ్రంథమే "గీతామకరందం'గా ప్రశస్తి పొందింది. ఎందరో, ఎన్నో విధాల గీతను వ్యాఖ్యానించి యుండవచ్చు. కాని ఆంధ్రావనిలో ఆధునికకాలంలో గీతా వ్యాఖ్యా గ్రంథాలలో ప్రథమ తాంబూలం గీతామకరందం దానికే అందింది. ఈ గ్రంథ రాజానికి ఆంగ్ల - తమిళ- కన్నడ భాషలలో గూడా అనువాదాలు వెలువడ్డాయి.

'మకరందం' అనగా తేనె' అని అర్థం. తేనె ఆయుర్వేదంలో చెప్పినట్లు అనేక సందర్భాలలో దివ్యౌషధంగా పనిచేస్తుంది. మామూలు తేనె పుష్పాలలో నుండి ఉదయిస్తుంది. ఈ గీతామకరందం కృష్ణభగవానుని వదనారవిందం నుండి వెలువడింది. అందువల్ల ఇది ఎంత ప్రశస్తమైనదో గ్రహించవచ్చు. అందుకే.

చేతోభృంగ! భ్రమసివృథా

భవమరు భూమౌ విరసాయామ్।

పిబ పిబ గీతామకరందం

యదుపతిముఖకమలభవాద్యమ్॥ అని గీతామకరందం

కీర్తింపబడింది.

గీతామకరందం మొదటి సారిగా 1963లో ప్రచురింపబడింది. దానిని గూర్చి ప్రసంగిస్తూ పూజ్యపాదులు శ్రీరామకృష్ణానందస్వాములవారు "అన్ని పుష్పాల సారం మకరందం. అన్ని మందులకూ అనుపానం తేనె. అట్లే ఈ గీతామకరందం అన్ని గీతావ్యాఖ్యాలసారం. ఇది వుంటే అన్ని రకాల గీతలూ మనవద్ద వున్నట్లే " అని ప్రశంసించారు.

ఈ గ్రంథంపై ఆ దినాలలో అనేక పత్రికలలో సమీక్షలు వెలువడ్డాయి. అన్నీ గీతామకరందాన్ని నిరుపమ గ్రంథరాజమని వినుతించాయి.

ఇందలి గీతా వ్యాఖ్యాన విధానం ఇలా సాగింది- మూలశ్లోకం, ప్రతి పదార్థం, తాత్పర్యం, విశేష వివరణ, ప్రశ్నలు, సమాధానాలు –ఇలా కొనసాగిన వ్యాఖ్య సరళ భాషలో నిబద్ధమయింది.

శ్రీ స్వాములవారు నిర్వహించిన గీతాయజ్ఞాలు వేలకొలది జనాన్ని ఆకర్షించేవి. కొన్ని నగరాలలో గీతాప్రవచనాలు కొనసాగేటప్పుడు సినిమాహాళ్ళు గూడా మూతబడ్డాయంటే శ్రీ స్వాములవారి వాగ్వైభవం ఎట్టిదో ఊహకందదు గదా! ఆ గీతా జ్ఞానయజ్ఞాలలోనే "గీతామకరందం' గూడా విరివిగా అమ్ముడై ప్రచారం పొందింది. ఇప్పటికీ దాని వ్యాప్తి తగ్గలేదు. నిత్యమూ శ్రీశుకబ్రహ్మాశ్రమానికి ఈ గ్రంథం కొరకై లేఖలు వస్తూనే వున్నాయి.

మూల గ్రంథాన్ని చదివినంత మాత్రాన గ్రంథంలోని విషయాలు సమగ్రంగా అవగతం కావు. వ్యాఖ్యానం చదివితేనే అందలి సారతత్త్వం గోచరిస్తుంది. అందువల్లనే "వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః" అనే సూక్తి ప్రసిద్ధి పొందింది. కాళిదాసాది కవులు రచించిన కావ్యాలకు మల్లినాథాదులు వ్రాసిన వ్యాఖ్యానాలు ఎంతో వ్యాప్తి పొందాయి కదా!



గీతామకరందం వెలువడక ముందే శ్రీమలయాళస్వాములవారు –గీతకు "గీతార్థ ప్రకాశిక" అన్న పేరుతో ఒక వ్యాఖ్యానం రచించారు. అందులో "యే ఽపి స్యుః పాపయోనయః స్త్రియో వైశ్యాస్తథా శూద్రాః" ఇత్యాది ప్రదేశాలలో కువ్యాఖ్యానాలు గతకాలంలో ఆవిర్భవించాయి. వాటిని శ్రీవారు నిశితంగా ఖండించారు.

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు పై విషయాన్ని గమనించి తమ రచనలలో శ్రీమలయాళస్వామివారు నిర్దేశించిన పద్ధతినే పాటించారు.

శ్లోకాల వివరణ పూర్తి అయిన తరువాత ప్రశ్నలు –సమాధానాల రూపంలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు కావించిన వివరణ ఎంతో విశిష్టమై యున్నది. గీతను గూర్చిన సమగ్రమైన అవగాహన దీనివల్ల కల్గుతుంది.

మరొక ముఖ్యాంశం ఈ గ్రంథానికి గల పీఠిక. ఇది 100 పుటలకు విస్తరించింది. గీతను గురించి తెలుసుకోదగిన విషయాలన్నీ ఇందులో అద్భుతంగా వివరించబడి వున్నాయి. గీతకూ, యోగ వాసిష్ఠానికీ గల సామ్యాన్ని గూడా ఇందులో వివరించారు. గీతకూ, ఉపనిషత్తులకూ గల సంబంధాన్ని గూడా విశదీకరించారు. ఈ ఉపోద్ఘాతమే ఒక స్వతంత్ర గ్రంథంగా భాసిస్తున్నది.

గీతామకరందం హిందీ,తమిళానువాదాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించింది. శ్రీ స్వాములవారి పలు గీతయజ్ఞాలను గూడా దేవస్థానంవారు నిర్వహించారు. వారి ఉపన్యాసాలను గూడా రికార్డు చేయడం జరిగింది. కాని ఆ ఉపన్యాసాలను తమ యస్.వి.బి.సి. ఛానల్ ద్వారా ప్రసారం చేయకపోవడం విచారకరం అది గూడా కార్యరూపం ధరించే సమయం ఆసన్నమగుగాక !

## రామాయణంలో శ్రీరాముడు చెప్పిన బోధ

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

### అరణ్యమున కేగునపుడు లక్ష్మణునితో చెప్పినది

దైవ విధానమును మఱియొక విధముగ ఎవరును చేయలేరు. సుఖదుఃఖములు, భయక్రోధములు, లాభనష్టములు, ఉత్పత్తి వినాశములు మొదలైన పరిణామములు ఏవి కలుగుచున్నవో, అవియన్నియు దైవముయొక్కయే క్రియలై యున్నవి. ఇట్టి తాత్త్వికబుద్ధిచే స్వయముగ, మనస్సును స్థిరపఱచుకొనినందువలననే రాజ్యాభిషేకమున విఘ్నము కలిగినప్పటికిని దుఃఖముగాని, సంతాపముగాని నాకు కలుగలేదు. కావున లక్ష్మణా! ఈ ప్రకారముగ నీవును నా యొక్క విచారణ ననుసరించి సంతాపరహితుడవై నాయొక్క రాజ్యాభిషేకముయొక్క ప్రయత్నమును విరమించుము.

### చిత్రముకూటమునందు భరతునితో చెప్పినది :

నీవు నాస్తికుల సహవాసము చేయుటలేదు కదా! ఏలయనిన వారు బుద్ధిని పరమార్థమునుండి చలింపజేయుటలో నేర్పరులు, మఱియు వాస్తవముగ అజ్ఞానులై యున్నను తమ్ములను గొప్ప పండితులుగా తలంచుచుందురు. నీవు గురుజనులకు, పెద్దలకు, తపస్వులకు, దేవతలకు, అతిథులకు, పవిత్రవృక్షములకు నమస్కరించుచున్నావా? నాస్తికత్వము, అసత్యభాషణము, కోపము, సోమరితనము, దీర్ఘసూత్రత్వము, జ్ఞానుల సాంగత్యము లేకుండుట, అలసత్వము, ఇంద్రియములకు లోబడుట,



రాజ్యకార్యములను ఒంటరిగ విచారించుట, మూర్ఖులయొక్క సలహా తీసికొనుట, నిశ్చయింపబడిన కార్యములను శీఘ్రముగ ప్రారంభింపకుండుట, గుప్తమంత్రణములను సురక్షితముగనుంచక ప్రకటించుట, శుభకార్యములను, పుణ్యకార్యములను అనుష్ఠింపకుండుట. శత్రువు లందఱిపైన ఒకేసారి దండెత్తుట -అను ఈ పదునాల్గు దోషములను సదా పరిత్యజించు చుంటివా? మన పితరులు ఎట్టి వృత్తిని ఆశ్రయించిరో, మన ప్రపితామహులు ఎట్టి ఆచరణను కలిగియుండిరో, సజ్జనులున్ను దేనిని సేవించుదురో, ఏది శ్రేయస్సునకు మూలమో దానినే నీవు పాలించుచున్నావు కదా! నీవు రుచికరమగు భోజనమును ఒక్కడవే తినుటలేదు కదా! దానిని అభిలషించు మిత్రులకు కూడ దాని నొసంగుచుంటివి కదా!

### అరణ్యమున భరతుని ఓదార్చుచు చెప్పినది :

పదార్థముల సంగ్రహములన్నిటియొక్క అంతము వినాశమే అయియున్నది. లౌకిక ఉన్నతులయొక్క అంతము పతనమే అయియున్నది. సంయోగముయొక్క అంతము వియోగమే అయి యున్నది. జీవితము యొక్క అంతము మరణమే అయియున్నది. జన్మించిన మనుజునకు మరణముచే తప్ప మఱి దేనిచేతను భయము లేదు. గట్టి స్తంభములుగల ఇల్లు కూడా పాతబడినచో పడిపోవునట్లు, మనుజుడు వార్ధక్యమరణముల వశమందు పడి నశించిపోవుచున్నాడు. నదీ ప్రవాహము వెనుకకు మరలనట్లు గడచిపోయిన రాత్రి తిరిగి వచ్చుటలేదు. పగలు, రాత్రి వరుసగా గడిచిపోవుచున్నవి. గ్రీష్మర్తువునందు సూర్య తాపము జలమును ఎండింపజేయునట్లు ఈ ప్రపంచమునందలి సమస్త ప్రాణికోట్లయొక్క ఆయుస్సును అవి తీవ్రముగ నశింపజేయుచున్నవి. ఈ లోకమున



Scanned with CamScanner

ఉన్నను, లేక అన్యత్ర వెడలినను ప్రతివానియొక్కయు ఆయుస్సు నిరంతరము క్షీణించుచునే యున్నది. ప్రతివానికిని మృత్యువు వెంటవచ్చుచున్నది. అతనితోబాటు కూర్చొనుచున్నది. దీర్ఘయాత్రయందు వానితోబాటు పోయి తిరిగి వానితోబాటు వచ్చుచున్నది. శరీరమున ముడతలు పడుచున్నవి. జుట్టు తెల్లబడుచున్నది. వార్ధక్యముచే శిథిలమైన మనుజుడు క్రమక్రమముగ మృత్యువునకు వశుడగుచున్నాడు.

జనులు సూర్యోదయము కాగానే సంతోషపడుచున్నారు. కాని ప్రతిదినము తన జీవితము నశించిపోవుచున్నదని మాత్రము యెఱుగకున్నారు. ఋతువు ప్రారంభముకాగానే, అది క్రొత్తగా వచ్చినదని ఆనందపడుచున్నారు. కాని ఈ ఋతువుల పరివర్తనముచే ప్రాణులయొక్క ఆయుస్సు క్రమముగ క్షయించిపోవుచు రెండు కట్టెపుల్లలు ఒకప్పుడు కలిసికొనుచు, మరల కొంతసేపటికి విడిపోవుచుండునో, అట్లే స్త్రీ పుత్ర కుటుంబ ధనములున్ను ఒకపుడు చెంతకువచ్చి మఱియొకపుడు వేరైపోవుచున్నవి. ఏలయనిన, వీనియొక్క వియోగము అవశ్యంభావియై యున్నది.

నదులయొక్క ప్రవాహము వెనుకకు మరలనట్లు దినదినము గడచిపోవుచున్న జీవితము తిరిగిరాదు. అది క్రమశః నశించిపోవుచున్నదని తలంచి మనస్సును శ్రేయస్సుయొక్క సాధనభూతమగు ధర్మమందు నియోగించవలెను. ఏలయనగా సర్వులును శ్రేయమునే కాంక్షించుచుందురు. ఈ పలు విధములగు శోకమును, విలాసమును, రోదనమును వదలివేయవలెను. పరలోకముపై విజయమును పొందనభిలషించు మానవుడు ధార్మికుడుగను, క్రూరత్వరహితుడుగను, గురుజనుల ఆజ్ఞను పాలించువాడుగను ఉండవలెను. నీవు నీ ధార్మిక స్వభావము ద్వారా ఆత్మోన్నతికొఱకై ప్రయత్నింపుము.



**చిత్రకూటమున జాబాలితో చెప్పినది :**

ఎవడు ధర్మముయొక్క, వేదముయొక్క పద్ధతిని వదలివేయునో, అట్టివాడు పాపకర్మయందు ప్రవృత్తుడగును. అతని ఆచార విచారములు భ్రష్టమైపోవును. కనుకనే అతడు సజ్జనులలో ఎన్నడును సమ్మానమును పొందనేరడు. సత్యముయొక్క పాలనమే రాజులయొక్క దయా ప్రధానమగు ధర్మము,సనాతన ఆచారము. సత్యమందే జగత్తంతయు ప్రతిష్ఠితమై యున్నది. ఋషులు, దేవతలు సదా సత్యమునే ఆచరించిరి. ఈ ప్రపంచమున సత్యవాదియగు మనుజుడు అక్షయపరమధామమునకు పోవును. అబద్ధము చెప్పువానిని చూచి జనులు సర్పమువలె భయపడుదురు. ప్రపంచమున సత్యమే ధర్మము యొక్క పరాకాష్ఠయనియు, అదియే అన్నిటియొక్క మూలమనియు చెప్పబడుచున్నది. ప్రపంచమున సత్యమే ఈశ్వరుడు. సత్యముయొక్క ఆధారము పైననే సదా ధర్మము ప్రతిష్ఠితమై యున్నది సత్యమే అన్నిటియొక్క మూలము. సత్యమును మించిన పరమపదము వేఱొకటి లేదు.

దానము, యజ్ఞము, హోమము, తపస్సు, వేదము వీనియన్నిటియొక్క ఆధారము సత్యమే అయియున్నది. కావున సర్వులును సత్యపరాయణులై యుండవలెను. ఎవడు తన ప్రతిజ్ఞను భంగమొనర్చుటకై ధర్మమునుండి భ్రష్టుడై పోవునో, అట్టి చపలచిత్తునిచే నొసంగబడు హవ్యకవ్యములను దేవతలు, పితరులు స్వీకరింపరని మనము విని యున్నాము. నేను ఈ సత్యరూప ధర్మమును సమస్త ప్రాణులకు హితకరమని, సమస్త ధర్మములలో శ్రేష్ఠమని తలంచుచున్నాను. సజ్జనులు ధర్మమును పరిపాలించుదురు. కావున నేను వారిని అభినందించుచున్నాను. భూమి, కీర్తి, యశస్సు, లక్ష్మి ఇవి యన్నియు సత్యవాదిని



Scanned with CamScanner

పొంద నభిలషించుచుండును. శిష్టుడగు మనుజుడు సదా సత్యమునే అనుసరించును. కావున మనుజుడు సదా సత్యమునే సేవించవలయును.

ఈ కర్మభూమిని పొంది శుభకర్మనే అనుష్ఠించవలెను. అగ్ని, వాయువు, సోముడు, శుభకర్మ ఫలమువలననే ఆయా పదవులను పొందియున్నారు. దేవరాజగు ఇంద్రుడు నూఱుయజ్ఞముల నాచరించి స్వర్గలోకమును పొందెను. మహర్షులున్ను ఉగ్రతపస్సును గావించి దివ్యలోకములందు స్థానమును బడసిరి. సత్యము, ధర్మము, పరాక్రమము, సమస్త ప్రాణులందు, దయ అందఱితో ప్రియముగ మాట్లాడుట, దేవతలను, అతిథులను, బ్రహ్మనిష్ఠులను పూజించుట వీని నన్నింటిని సాధుమహాత్ములు స్వర్గలోక మార్గముగ పేర్కొనిరి. ఎవరు ధర్మమునందు తత్పరులై యుందురో, సజ్జన సాంగత్యము గలిగియుందురో, తేజస్సంపన్నులై యుందురో, దానమను గుణము ప్రధానముగ గలిగియుందురో, ఏ ప్రాణికిని బాధను గలిగింపరో, మాలిన్యము లేక యుందురో, అట్టి శ్రేష్ఠులగు మునులే ఈ ప్రపంచమున పూజనీయులై యుందురు.

**ఆశ్రమ కంటి ఆసుపత్రి నిధికి "త్రినేత్ర వైద్యాలయ ట్రస్టు" కు ఈక్రింది వారు పైకం పంపినారు**

| | | | |
|---|---|---|---|
| (1). | జి.శ్యామల గారు (హైద్రాబాద్) | - | రూ. 1,00,000/- |
| (2). | మల్లిమాల రమణమ్మ (బసవయ్యపాళెం) | - | రూ. 20,000/- |
| (3). | ఎ.వి.నాగేష్ (బెంగుళూరు) | - | రూ. 15,000/- |
| (4). | పి.నాగేశ్వరరావు (వరంగల్లు) | - | రూ. 10,000/- |

**వేదాన్తభేరికి పోషక చందాను ఈ క్రిందివారు పంపినారు**

| | | | |
|---|---|---|---|
| (1). | గుబ్బా శ్రీనివాసులు (మహబూబ్‌నగర్) | - | రూ. 2,000/- |
| (2). | కె.భానుమూర్తి (బాచుపల్లి) | - | రూ. 2,000/- |



## మాధవనామ మాధుర్యము!

**- బ్రహ్మీభూత పూజ్యసర్వేశ్వరానందగిరి స్వాములవారు (తిరుపతి)**

మనము వసించు యీ మానవలోకమున మధురాతి మధురమై విలసిల్లునదొక్క మాధవుని పవిత్రమైన దివ్యనామము మాత్రమే! ఎనుబది నాలుగు లక్షల జీవరాసులలో నున్నతమైనసంస్కారములతోను, ఉత్తమమైన భావములతోను విరాజిల్లు మానవజాతి మాత్రమే మాధవుని మధురనామములోగల మాధుర్యమును ఆస్వాదించగల శక్తి సామర్థ్యములను అవగాహన మొనరించుకొనగల మేధాసంపత్తిని గలిగియున్నది. అంతేగాక, మోక్షప్రాప్తికి కావలసిన సాధన సామగ్రిని సమకూర్చుకొని ఆచరించి తరించుటకనువైన దొక్క మానవజన్మమాత్రమేనని ఉపనిషదాది సద్గ్రంథము లన్నియు యేకకంఠమున ఉద్ఘోషించుచున్నవి. ఇట్టి సర్వోత్కృష్టమును, సుదుర్లభమునునైన మనుష్యజన్మ బహుజన్మార్జిత సుకృత ఫలమని మహాత్ములెల్లరును అనుభవ పూర్వకముగ వచించుచున్నారు. వస్తువుయొక్క వెలను చెల్లించువారికది యెటుల లభించునో, అటులనే అనేక జన్మలలో నొనరించిన పుణ్యపణము చెల్లించిన జీవులకు మాధవ ధర్మనమునకు యోగ్యమైన మానవజన్మ లభించగలదు.

అనుకూల వాతావరణము, అందులకు తగినటుల చక్కటి వాయువు అనుకూలముగ వీచుచున్నప్పుడు నావలో పయనించు వారికా వాయువెంతగనో సహకారిగా నుండి తీరమును త్వరగా జేర్చునటుల సర్వేశ్వరుడైన మాధవుని దివ్యానుగ్రహమనెడి అనుకూల శక్తి భక్తుని గమ్యస్థానమున కచిరకాలమున తప్పకజేర్చగలదు. మనమొనరించు ఆధ్యాత్మిక యత్నమనెడి యాత్రకు పరమేశ్వరుని ప్రచండమారుతరూప దివ్యానుగ్రహము తోడగుచో, గమ్యమైన మోక్షధామమునకు త్వరితముగ జేర్చు అవకాశముగలదుగాన పరిపూర్ణ శరణాగతిద్వారాను అనన్య భక్తి చేతను, జప, ధ్యానార్చనలవలనను, నామసంకీర్తనలచేతను సర్వేశ్వరుని యనుగ్రహమనెడి మహాప్రసాదమును మానవుడవశ్యము బడయవలసి

యున్నది.

శ్లో ॥ ఆపన్నః సంసృతి ఘోరాం యన్నామ వివశోగృణన్ ।
తతఃసద్యో విముచ్యేత యద్బిభేతి స్వయం భయమ్ ॥ (భాగవతం 1-1-14)

అత్యంత ఘోరమగు సంసారతాపమును అనుభవించువారు సచ్చిదానంద స్వరూపుడగు మధుసూదనుని మంగళకరమైన మధుర నామామృతమును పానమొనరించినచో అన్ని దుఃఖములనుండి అవశ్యము విముక్తిబొందుటే గాక అట్టివారిని గాంచి భయము గూడ భీతినొందున"ని శ్రీమద్భాగవతమునందు వచింపబడెను.

భగవానుని దివ్యనామ ప్రభావమెంత శక్తివంతమైనదో పై భాగవత శ్లోకమున వివరింపబడినది. సంసార విషవృక్షమును ఛేదించుటకు సర్వేశ్వరుని దివ్యనామము గండ్రగొడ్డలి వంటిది. తాపత్రయోపశమనమునకు నారాయణ నామస్మరణమనెడి శీతలోదకమునకు మించినమందు వేఱొండులేదు గదా! విషయోపభోగరూప విషపు కోరలో చిక్కుకున్న మానవులకు మధుసూదమని మంగళకర నామసంకీర్తనము సంజీవితో సమానము. ఎంతటి ఘోరమైన సాంసారిక విపద్రూపదావానలములో చిక్కుకొన్న వారైనను దామోదరుని దివ్యనామస్మరణము నాశ్రయించినచో, ఇంద్రజాలమువలె సకల సంసారము సమసి, ఆనందమయులై మనగలరు. ఏలయన, "వాచ్య వాచకయోరభేదః" యనెడి న్యాయప్రకారము నామమునకు నామికిని యెవ్విధమైన భేదమూలేదు.

పరమేశ్వరుని పవిత్ర నామమును స్మరించుచో నద్దానికాధారమైన పరమేశ్వరుడు మన హృదయమునవసించుట సహజముగ జరుగును. అంతేకాక, ఆ దయామయుని దివ్య సుందర విగ్రహము మన యెట్టయెదుట విరాజమానమైయున్నదని గ్రహించవలయును.

శ్లో ॥ నాహం వసామి వైకుంఠే యోగినాం హృదయేషుచ ।
మద్భక్తా యత్రగాయంతి తత్ర తిష్ఠామి నారద! ॥



" ఓ నారదా! నేను వైకుంఠమునగాని, యోగిపుంగవుల హృత్పద్మములయందు గాని వసించను. నా భక్తులెచట నన్ను కీర్తించుదురో, మఱియు నా దివ్యనామ సంకీర్తనల నొనరింతురో, నేనచట అవశ్యము వసించుదు "నని వచించిన వాసుదేవుని వాక్యమే ఇందులకు పరమప్రమాణము. "అనన్యచిత్తముతో నన్నే ఆరాధించుచు, అనవరతము నా దివ్యరూపమును ధ్యానించువారిని మృత్యుసంసార సాగరమునుండి నేనుద్ధరింతు"నని అనన్యేనైవ యోగేన మాంధ్యాయన్త ఉపాసతే తేషామహం సముద్ధర్తా మృత్యు సంసారసాగరాత్' ( భగవద్గీత 12 అ॥ 6-7 శ్లోకాలు) మాధవుడుద్ఘోషించెను.

గత చరిత్రను పరికించి పరిశీలించిన యెందరో మహాత్ములు దీన రక్షకుడగు నారాయణుని దివ్యనామప్రభావముచే దుఃఖ భూయిష్టమైన సంసార సాగరమును తరించినటుల తెలియబడుచున్నది. పురాణ కాలము నాటి వామదేవ, శాండిల్య, నారద, పరాశర, ప్రహ్లాద, ఉద్ధవాది ఉత్తమ భక్తశిఖామణులు మొదలుకొని ప్రస్తుతకాలపు గౌరాంగ,నామదేవ, రామదాస, అన్నమాచార్య, తుకారామ, విఠలాచార్య, నరసింహామెహత, మీరాబాయి, సక్కుబాయి, ముక్తాబాయి, తరిగొండ వెంగమాంబాది భక్తవరేణ్యుల వరకు యెందరో శ్రీనివాసుని చరణారవిందములాశ్రయించి, ఆతని దివ్యనామస్మరణామృతమును అనవరతము పానమొనర్చి పావనులై తరించిరి.

సర్వేశ్వరునివలె సకల విధముల ఆతని సమ్యక్‌నామము సైతము సత్యశివసుందర స్వరూపమై సర్వకాల సర్వావస్థల యందును ప్రకాశించుచుండుటచే, వెలుగులను విరజిమ్ము జ్యోతి కాంతివంతమై వెలుగొందుచోట అంధకారమెల్ల తొలగిపోవునటుల, పరమేశ్వరుని పవిత్ర పాదారవిందములనాశ్రయించి, సర్వార్పణబుద్ధితో నాతని దివ్యనామస్మరణ నొనరించుచున్నచో నా కృపామయుని యనుగ్రహముచే సకల సంకటములు సమసి,హృదయ శుద్ధి గలుగుట ద్వారా ముక్తి నొందనర్హులము కాగలము.



Scanned with CamScanner

మూలం: **ఉద్ధవ గీత** అనువాదం:

శ్రీవేద వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

శ్రీకృష్ణ భగవానుడు : మిత్రమా ! ఉద్ధవా! జ్ఞానయోగము – భక్తియోగముల గురించి ఒక సందర్భంలో ఒక మహానుభావుడు చెప్పిన విశేషాల చెప్పుతాను విను.

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. యుధిష్ఠిరుడు (ధర్మరాజు) ఆ తరువాత ఎంతో మానసిక వేదన చెందాడు. ఒకరోజు గ్రామ -పట్టణాలలో సంచరిస్తూ – "అయ్యో ! నాయొక్క రాజ్యకాంక్ష వల్లనేకదా అనేకమంది మరణించారు! వారి భార్యలు అంతా పోగొట్టుకొని ఇంటిలో రోదిస్తున్నారు! ఇంతమంది బంధువుల మరణానికి నేనేకదా కారణం!" అని దుఃఖించసాగాడు. "నువ్వు కారణమవటమేమిటయా? ఇదంతా ఈశ్వరమాయ..." అని నేను చెప్పినా, ఆయనకు దిగులు -దుఃఖము తొలగలేదు. అప్పుడేం చేయాలి? ఆయన వేదన తొలగేది ఎట్లా ? నాకొక ఉపాయం తట్టింది. " ఓ యుధిష్ఠిరా! నీ దుఃఖం తొలగాలంటే ఏదైనా గొప్ప ఉపాయంచేత అజ్ఞానం తొలగాలి. అందుకు ఒకే మార్గం. మహనీయుల సత్సాంగత్యం. పద, మహాజ్ఞాని- భక్త మహాశయుడు అగు పితామహుడు శ్రీ భీష్ములవారి వద్దకు వెళ్దాం ! వారి వాగమృతమే మనందరికి దివ్యౌషధం..." అని చెప్పాను. అక్కడున్న భీమ- అర్జున -నకుల-సహదేవులు, తదితరులు, "అవును! శ్రీకృష్ణ వాక్యంతు కర్తవ్యం! తాతగారు భీష్మ మహాశయుల భక్తి- జ్ఞాన పాఠ్యాంశాలే మనకు ఇప్పుడు దివ్యౌషధం" అని పలికారు.

అందరము కలసి యుద్ధభూమిలో ఒకానొకచోట అంపశయ్యపై



పవళించియున్న మహాత్ములగు శ్రీ భీష్ముల వారిని సమీపించాము. అప్పుడు భీష్మ పితామహులవారు అనేక ధర్మ సూక్ష్మ విశేషాలు చెప్పుతూ -చెప్పుతూ, చివరికి సర్వ శాస్త్ర సార విశేషమైనట్టి మోక్షధర్మము గురించి ప్రవచించారు. అది జ్ఞాన-విజ్ఞాన-వైరాగ్య విశేషాలతో కూడిన మహత్తర అనుభవ పూర్వక మహావాక్యాలు, భావాలు కలిగియున్నట్టిది. ఆయన చెప్పిన వాక్య సారాంశము కొంత ఇప్పుడు చెప్పుచున్నాను. విను.

ఆత్మజ్ఞానము : సృష్టికర్తయగు బ్రహ్మదేవుని నుండి -కదలకుండా కనిపించే రాయి వంటి స్థావరముల వరకు ( ఆబ్రహ్మ స్తంబ పర్యంతము) ఇదంతా కార్యరూపము అంటారు. అనగా...( దృష్టాంతానికి)... మట్టితో కొన్ని బొమ్మలు (రాజు -మంత్రి-సైనికుడు-గుఱ్ఱము-ఏనుగు మొదలైనవి) తయారు చేసారనుకుందాం. మట్టి కారణరూపము అంటారు.

బొమ్మలు వాటి వాటి కథ -కమామీషు కార్యరూపముగా అనుకో !ఇప్పుడు కార్యరూపము – కారణరూపముగా గమనిస్తే... ఇదంతా సర్వదా శ్రీకృష్ణ చైతన్య ప్రభునిత్యానందమే! మట్టి బొమ్మలలో మట్టియే సత్యము కదా!

కార్యరూపము :

1. పురుషుడు ( Indvidual experiencer) 2. ప్రకృతి (Nature స్వభావము )

3. మహత్తత్వము (Multi presentation అనేకముగా కనిపించటం )

4. అహంకారము : (నేను -నేను అనిపించటం)

5-9 పంచతన్మాత్రలు : శబ్ద = స్పర్శ-రూప-రస-గంధాలు

10-20 ఏకాదశ ఇంద్రియములు : కళ్ళు, చెవులు -కాళ్ళు- చేతులు -ముక్కు – నాలుక -చర్మము-గుహ్యము- గుద -మనస్సు -బుద్ధి- జ్ఞప్తి అనుభూతి



Scanned with CamScanner

21-25 పంచభూతములు : స్థూలము ( Solid - భూమి)
( ద్రవము ( Liquid - జలము) అగ్ని (Fire ` Heat - అగ్ని)
వాయువు (Vapour - Air ) స్థలము (Placement - ఆకాశము)
26-28 గుణత్రయము - సత్వగుణము, రజోగుణము, తమోగుణము ఇవన్నీ 28 తత్వములుగా వేరువేరుగా వేరువేరు ధర్మములతో కనిపిస్తున్నాయి కదా! ఇవన్నీ కార్యరూపములు.

ఇవన్నీ వేరువేరుగా అగుపిస్తున్నప్పటికీ వీటియొక్క మూల పదార్థము ( The main material all these made up of ) పరమాత్మయే ! అట్టి భిన్నత్వములో ఏకత్వమే అయినట్టి ( unity in the Diversity) పరమాత్మతత్త్వమును నిర్వచించి చెప్పు జ్ఞానమే ఆత్మజ్ఞానము !

విజ్ఞానము : ఎవ్వరికైతే పూర్వమున ఉన్నవి - ఇప్పుడు కనిపిస్తున్నవి -ఇవన్నీ వేరువేరుగా కాకుండా -సర్వము పరమాత్మ స్వరూపముగా అనిపిస్తుందో, అట్టి స్థితి - స్థానమే విజ్ఞానము అనే శబ్దముతో చెప్పబడుతోంది. రూపముల -నామముల -ధర్మముల దృష్టిచే అనేకంగా కనిపిస్తున్నటికీ ... ఒక్కటిగా అనిపించటమే విజ్ఞానము. "సృష్టిగా -స్థితిగా-లయముగా -అప్రమేయముగా, అద్వితీయముగా కనిపించేదంతా మమాత్మయే ! -నేనే" అని ఆస్వాదించబడుచుండటమే విజ్ఞానము ! ఏదైతే...., - సృష్టి -ప్రళయముల సందర్భాలలో కారణరూపంగాను. - స్థితి కాలంలో సర్వము ఆశ్రయించి ఉన్నటి.... ఆశ్రయరూపంగాను, (కార్యరూపంగాను) - ఒక కార్యము నుండి మరొక కార్యమునకై నిరంతరం ప్రయాణిస్తున్న అప్రమేయరూపంగాను ( ఊదాహరణకు జాగ్రత్‌లోంచి స్వప్నంలోకి -స్వప్నంలోంచి సుషుప్తికి, సుషుప్తి నుండి స్వప్నమునకు - ఆమూడు తనవై ప్రయాణిస్తూ- తాను



మాత్రం యథాతథంగా ఏర్పడి ఉన్న సర్వుల స్వస్వరూపంగాను...) - అంతా లయించినప్పుడు కూడా అప్పటికీ శేషించి ఉన్నదిగాను., ప్రకాశిస్తోందో అదియే సత్త -అదియే - పరతత్త్వము- తురీయము! అదియే ఓంకారముగా కూడా చెప్పబడుతోంది!

అదియే సత్త ! (Existant), తదితరమైనదంతా అసత్త (Non`Existant) ఈ జగత్తు సందర్భరూపంగా అసత్తు. సహజరూపంగా బ్రహ్మమే!

జీవుడు ఆ సత్ వస్తువు గురించి, అద్దానితో తనకుగల అభేదత్వము, అద్వితీయత్వము, తన యొక్క నిర్వికల్పము, అవాక్ మానస గోచరత్వము గురించి ఎఱుగుటయే విజ్ఞానము.

ఇక దృశ్యమంటావా.... ఇదంతా స్వప్నసదృశం మాత్రమే ! కలలోని సంఘటనల గురించి మెళుకువ వచ్చిన తరువాత దుఃఖించటంలో అర్థమేముంటుంది?

చూచావా ఉద్ధవా! ఎదురుగా ప్రత్యక్షంగా ఈ నామ -రూప జగత్తు (ఇంద్రియములకు) అగుపిస్తోంది. అయితే, ఇదంతా అసత్తు. దీనికి ఆవల (పరము)గా ఉన్న పరమాత్మ తత్త్వమే సత్యము. సత్తుకూడా! మూలతత్త్వము! బ్రహ్మము! కనుక సందర్భ సత్యమగు నామ రూప జగత్తును దాటి సహజసత్యమగు బ్రహ్మమును ఆలంబన చేసుకో!

**ఉద్ధవుడు :** 1. ఎదురుగా ఘనీభూతమై కనిపిస్తు దృశ్య -భావనా జగత్తు. 2 పుణ్య కర్మఫలముగా చెప్పబడుచూ - కొందరిచే జీవిత లక్ష్యములుగా భావించబడే స్వర్గము. మొదలైన సుఖమయ లోకములు ఇవన్నీ అసత్తే అని, కేవలము కాలబద్ధమని తేల్చి చెప్పుచున్నారు కదా ! ఈవాక్యము



Scanned with CamScanner

ఆత్మవిద్యను బోధించే గురువుల మొదటి వాక్యముగా మేము విన్నాము. వింటూనే ఉన్నాము. అయితే ఈ ఎదురుగా అగుపించేదంతా మాకు దుఃఖభరితంగాను, అనుల్లంఘ్యమైనట్టి సంసార సముద్రముగాను, అనేక జన్మల కర్మార్జిత బంధంగాను అనిపిస్తోందేగాని....

– ఇదంతా సందర్భరూపంగా అసత్తు! –సహజరూపంగా చూస్తే ఆత్మయే! అని ఏమాత్రం అనిపించటమేలేదు!

ఎవ్వరో మాయందు అనురక్తిని కల్పించి మమ్ములను ఈ దృశ్యమునకు, జన్మ–కర్మలకు బద్ధునిగా చేసి ఉంచుచున్నట్లుగా అప్పుడప్పుడు అనిపిస్తోంది. సంసార సాగరము అనబడే మా ఈ దృశ్య సత్తాధ్యాస తొలగేది ఎట్లా ?

**శ్రీ కృష్ణభగవానుడు :** ఔను! "నతు సత్యమిహ అణ్వపి" అని విబుధులు, ఆత్మకోవిదులు ఎలుగెత్తి, తట్టి చెప్పుచున్నప్పటికీ, "ఇదంతా నాకు బంధము!...." అనే భ్రమ అనేకమంది జీవులపట్ల తొలగటం లేదు! " ఈ కనబడేదంతా మమాత్మ స్వరూపమే! నేనే! నా కళా విన్యాసమే!..." అనే ఆత్మజ్ఞాన విజ్ఞానోదయం కావటం లేదు. ఇందుకు ఔషధంగా నాలుగు ప్రమాణాలు విజ్ఞులచే చెప్పబడుచున్నాయి.

1.శ్రుతి ప్రమాణము : వేద – ఉపనిషత్తుల మహావాక్యాలు ప్రసాదిస్తున్నాయి.

| | |
|---|---|
| తత్ త్వమ్ ! | అదియే నీవుగా కనిపిస్తోంది |
| జీవో బ్రహ్మే ఉతి నాపరః ! | జీవుడుగా నాకు కనిపిస్తున్నది బ్రహ్మమే! |
| అయమాత్మా బ్రహ్మ ! | జీవాత్మయే పరబ్రహ్మము ! |
| అహమాదిర్హి ! | అన్నిటికీ మొదలే నేనున్నాను ! |
| సో ఉహమ్ ! | నేను పరమాత్మ స్వరూపుడనే ! |



| | |
|---|---|
| త్వమేవా ఉహమ్ ! | నీవుగా కనిపించేదంతా నేనే ! |
| అహమ్ సర్వస్య ప్రభవో ! | అన్నిటినీ ప్రభవింపజేస్తున్నది నేనే ! |

మత్తఃపరతరమ్ న అన్యత్ కించిదస్తి! నాకు వేరైనదంటూ ఎక్కడా ఏదీలేదు!ఇత్యాది శ్రుతి – స్మృతి మహావాక్యాల అర్థము విచారణ చేస్తే, గురుముఖతః వింటే స్వస్వరూపమగు ఆత్మయొక్క ఔన్నత్యం గ్రహించబడు చుండగాఈ దృశ్యానుభవముయొక్క స్వాప్నికత, దీనికి ఆధారమైన అనన్యపరతత్త్వము –మహదత్వము విశదీకరణమౌతోంది. ఇది శాస్త్ర ప్రమాణము!

**2. ప్రత్యక్ష ప్రమాణము :** ఇంద్రియములకు గోచరమయ్యేది ! –శాశ్వతమా? – సత్యమా? – మనోకల్పనయేనా ?

ఒక సందర్భము – సంఘటన అజ్ఞులు ఎట్లా చూస్తున్నారు? ఆ అజ్ఞాని విజ్ఞానమును సంపాదించుకొని అటుపై చూస్తే వాటి వాటి నిర్వచనాలు ఏవిధంగా ఉంటున్నాయి?

చూడబడేదంతా చూచేవాడియొక్క మనోచమత్కారమేనా?

చూచేవాడిని చూచేవాడు (One who is perceiving the own perceiver of the world) అనబడే ఆత్మ ప్రమేయమా? ( Is it bounded and related to what is being seen? ) అప్రమేయమా? (Is it beyond and unreleated) ఇటువంటి ప్రత్యక్షము యొక్క విచారణచే ప్రత్యక్షము –పరోక్షము కూడా కానట్టి అపరోక్షజ్ఞానము ఉదయిస్తోంది. ఆత్మయే అంతటా సాక్షాత్కారమై అభిన్నమై అనుభూతమౌతోంది! ఈ మార్గమునే ప్రత్యక్ష ప్రమాణము అని అంటారు.

**3. ఐతిహ్య ప్రమాణము :** నాకు అనుభూతమైయ్యేదంతా ఆయా తీరుగా



Scanned with CamScanner

సత్యమా? కాదా?అని అనుమానం వచ్చినప్పుడు ఈ జీవుడు ఏం చేయాలి? విజ్ఞులను మహనీయులను ఆశ్రయించాలి. వారి అనుభవమును - నిర్ణయములను ప్రమాణంగా తీసుకోవాలి కదా! అట్టి మహనీయుల చరిత్రలు -ప్రవచనములు-అంతిమ సార వాక్యములు, అభిప్రాయములు ఇతిహాసములుగా గ్రంథస్తమైనాయి. అట్టి (రామాయణ - భారత - భాగవతాది) ఇతిహాసములు ముముక్షువులకు ప్రమాణములై అంతిమ సత్యమును సాక్షాత్కరింపజేస్తున్నాయి. ( శ్రీ వసిష్ఠ విరచిత యోగ వాసిష్ఠం, బ్రహ్మ సూత్రములు. ఇత్యాదివి అందుకు ప్రమాణములు).

**4. అనుమానము** - గురువుల అనుభవవాక్య ప్రమాణము : స్వకీయమైన పరిశీలన -విశ్లేషణయే చివరికి జీవునికి ఆత్మ జ్ఞానమును - ఆత్మ దర్శనమును - ఆత్మానుభూతిని - ఆత్మానందమును ప్రసాదించగలవు.

శ్రుతి - ప్రత్యక్షము -ఐతిహ్యము (ఇతిహాసములు) - గురువులు స్వకీయమైన విచారణకు తోడగుచున్నాయి. మార్గదర్శకమౌతున్నాయి.

**శ్లో** ॥ శ్రుతిః ప్రత్యక్షమ్ ఐతిహ్యమ్ అనుమానం చతుష్టయమ్
ప్రమాణేషు అనవస్థానాత్ వికల్పాత్ స విరజ్యతే ॥ ( అధ్యా 19, శ్లో 17)

పైన చెప్పబడుచున్న 4 ప్రమాణముల సహాయంతో జీవుడు దృశ్యముపట్ల క్రమంగా విరక్తుడై ఆత్మ సందర్శనము పట్ల అనురక్తుడగుచున్నాడు. ఇక ఇహ -పరములైన సంపద -స్వర్గాదిఫలముల సంగతేమిటంటావా? యజ్ఞాదులవలన లభించగల స్వర్గలోక నివాసము ఇత్యాది ప్రత్యక్ష విషయ సుఖములన్నీ - నశ్వరములు (అశాశ్వతము Time Bound)- దుఃఖకరములు ( Worries do continue) - అమంగళములు ( Does not lead to true Welfare ) అని మునుముందుగానే గ్రహించినవారై ఉంటున్నారు.

# శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు గురుదేవులు

-డా॥ఎ. తారాలక్ష్మి, M.A., M.Ed.,Phd.,(శ్రీకాళహస్తి)

ఫల పుష్పాదులతో కూడిన వసంతఋతువు వలె భక్తి జ్ఞాన వైరాగ్యాదులతో కూడినవారై, శాంతులై, దాంతులై లోక హితమునకై అవతరించెడి మహాత్ములు అతి భయంకరమైన సంసార సముద్రమును దాటి, తాము తరించడమే గాక, అందు మునిగే ఇతర జనులను కూడ తమ దయార్ద్ర దృష్టితో తరింపజేయుచున్నారు. అట్టి మహనీయుల కోవకు చెందిన వారే శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

గురువంటే ఎవరు ?అన్న ప్రశ్నకు "శ్రోత్రియుడు మరియు బ్రహ్మనిష్ఠుడు" అని ఉపనిషత్తు సమాధానమిస్తుంది. శాస్త్రములను శోధించి, ఆ సారాన్ని గ్రహించి, దానిని తాను స్వయంగా ఆచరిస్తూ, శిష్యునకు కూడ దానినే బోధించి ఆచరింపజేయు వానిని సద్గురువు అన్నారు పెద్దలు. ఇట్టి శుద్ధ శ్రోత్రియులకోవకు చెందిన మహాత్ములే శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. సనాతన ఆధ్యాత్మిక ధర్మ సంస్కృతికి శ్రీ స్వామి వారు ప్రసాదించిన సాహిత్యం అమూల్యం. శ్రీమద్ భగవద్గీత విశ్వ విఖ్యాత గ్రంథము. గీతా శాస్త్రము సమస్త వేదార్థ శాస్త్ర సంగ్రహమని, శ్రీ శంకర భగవత్ పాదుల వారు "గీతా భాష్యము"లో పేర్కొని యున్నారు. అట్టి గీతాశాస్త్రమను తేనెతుట్టె నుండి మకరందమును పిండినట్లుగా, వేదాంత సారమును సంగ్రహించి గీతామకరందమును మనకు అందించిన మహాత్ములు మన సద్గురు దేవులు.భగవద్గీతపై ఇంతకు మించిన వివరణ గ్రంథము మరియొకటి లేనే లేదు. భగవద్గీతకు సంబంధించిన అన్ని అంశములు ఇందు పొందు పరచబడి యున్నవి. ఈ గ్రంథమును పఠించిన

సాధకునకు గీతారహస్యముల వివరణ కొరకు మరియే ఇతర గ్రంథములను పఠించవలసిన పనిలేదు.

పూజ్య గురుదేవులు రచించిన పంచరత్నాకరములు వారి అఖండ శ్రోత్రియ ప్రతిభకు నిదర్శనములు. అత్యంత క్లిష్టతరమైన వేదాంత వాక్యార్థములను సైతము సామాన్యులకు సైతము అవగాహన కలుగు రీతిలో రచించడము శ్రీ స్వామి వారికే చెల్లింది. ఆచరణాత్మక వేదాంతం ఎంతటి సులభతరమో సరళమైన పద్ధతులతో వివరించి, సామాన్య జనుల దైనందిన జీవితములకు అన్వయించి, పరిష్కార మార్గములను చూపుటలో వివేకానందుల వారి తరువాతి స్థానం శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిదే ననుటలో ఏ మాత్రము అతిశయోక్తి లేదు.

సద్గురువు కేవలము శ్రోత్రియుడైనంత మాత్రమున సరిపోదు. వేదాంత వాక్యార్థ జ్ఞానముతోపాటు ఆతను బ్రహ్మనిష్ఠుడై ఉండవలెను. తాను సదా స్వస్వరూప పరబ్రహ్మమునందు మనస్సును లయము చేసి యుండవలెను. శిష్యులను సత్ వస్తువగు ఆత్మయొద్దకు చేర్చువాడే సద్గురువు. ఈ జగత్తులో గురువులు దొరకవచ్చును గాని సద్గురువు దొరకుట దుర్లభము. సదాచారమును వాక్కునందే కాక ఆచరణలో చూపువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాన్ని రూపుమాపి జ్ఞానజ్యోతిని వెలిగించువాడే సద్గురువు. అట్టి యోగ్యతలు మెండుగా కల్గిన సద్గురువు మన పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. అకుంఠిత దీక్ష, తపోనిష్ఠ, ఏకాగ్రత వారి ఆయుధాలు. నిబద్ధతలో నియమ పాలనలో సర్వులకు వారు ఆదర్శ ప్రాయము. ఆచరణాత్మకమైన నియమబద్ధమైన వారి దివ్య జీవనము జనులందరికి స్ఫూర్తిదాయకం.

బ్రహ్మానుభూతిని పొందిన విద్యాప్రకాశానందుని హృదయమునుండి పొంగి పొరలిన బ్రహ్మజ్ఞానము, ఎందరో సామాన్య



జనులను ముముక్షువులగను, మరెందరో ముముక్షువులను ముక్తులుగను జేసినది. వేదాంతభేరిని వారు దశదిశల మ్రోగించిరి. అత్యంత క్లిష్టతరమైన ఆత్మతత్త్వవిచారణను అరచేతి వైశాల్యాన్ని మించని 16 పేజీల చిన్న పుస్తకంలో పామరులకు సైతము అర్థమగు రీతిలో రచించిన శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానంధగిరి స్వాములవారు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు అనుటలో ఎంతమాత్రము సందేహము లేదు.

## భగవంతుడికి ఇష్టమైనవారు శ్రీ సద్గురుదేవులు

**- కె. ఈశ్వర్**

మనకు భగవంతుడంటే ఇష్టమే.

భగవంతుడికి మనమంటే ఇష్టమా ?!

అను విషయాన్ని గురించి మనమంతా ఆలోచించాలి. భగవంతుడికి ఇష్టమైన పనులు చేసినవారంతా ఆయనకు ఇష్టమైనవారే.

భగవంతుడికి ఇష్టమైన పనులు చేసి భగవంతుని సంపూర్ణ ఆశీస్సులు, దండిగ, నిండుగ, మెండుగ పొందినవారి జాబితాలో చేరినవారే పూజ్యపాదులు, గురుదేవులు, శ్రీ శుకబ్రహ్మాశ్రమ సంస్థాపకులు, గీతామకరంద గ్రంథ రచయిత శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు. శ్రీ స్వాములవారు గీతాచార్యునికి ఎంత సన్నిహితులో ఈక్రింది గీతాశ్లోకాలు వివరిస్తున్నవి.

**శ్లో ॥ యం ఇమం పరమం గుహ్యాం**
**మద్భక్తేష్వభిధాస్యతి,**
**భక్తిం మయి పరాం కృత్వా**
**మామేవైష్యత్యసంశయః(18 అ - 68 శ్లో ॥ )**

ఎవడు అతి రహస్యమగు ఈ గీతాశాస్త్రమును నా భక్తులకు



Scanned with CamScanner

వివరించునో అట్టివాడు నన్నే పొందగలడు.

**శ్లో ॥ న చ తస్మాన్మనుష్యేషు**
**కశ్చిన్మే ప్రియకృత్తమః**
**భవితా న చ మే తస్మా**
**దన్యః ప్రియతరో భువి (18 అ - 69 శ్లో॥)**

మనుజులలో అట్టివానికంటే నాకు ప్రియమొనర్చువాడెవడును లేడు మరియు అతనికంటే నాకు మిక్కిలి ఇష్టుడైనవాడు ఈ భూలోకమున మరియొకడు వుండబోడు. భగవద్గీతా ప్రచారమునకై భగవంతుడు పంపించిన మహర్షి శ్రీ స్వాములవారని అందరినోట ఇదేమాట.

| | | |
|---|---|---|
| ఏమి మహిమో | - | తెలియలేము |
| ఎంత ఘనతో | - | చెప్పలేము |
| ఇంటి పనులు | - | చక్క పెట్టి |
| వంటవార్పులు | - | చేసి చేసి |
| పరుగు పరుగున | - | గీత బోధకు |
| కదలివచ్చిరి | - | ఎంత వింతో |

వంటపనులు, ఇంటి పనులు ఎన్ని వున్నా, కష్టముతోనో, ఇష్టముతోనో పూర్తి చేసుకుని శ్రీ స్వామివారి గీతా ప్రవచనములకు పరుగో పరుగు. వచ్చిన వారు వచ్చినట్లుగ కూర్చొని ఆషామాషిగా వినుట ఎంతమాత్రము కాదు. ఇల్లు వాకిళ్ళు మరచి గీతా ప్రవచనము వినుటలో లీనమైపోయేవారు. అశాంతితో, బాధలతో, జీవితముపై విరక్తి కలిగినవారు సహితము శ్రీవారి బోధలతో, వారి బాధలు తీరినట్లు భావించేవారు. మనశ్శాంతి పొందేవారు.

గీతాయజ్ఞముల పేరుతో భగవద్గీతా ప్రవచనముల ద్వారా ఒక విప్లవాన్ని సృష్టించారు. ఆ విప్లవానికి తిరుమల, తిరుపతి దేవస్థానం ఆనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, ఐ.ఎ.ఎస్ వారు శ్రీవారి ప్రవచనాలకు ఆకర్షితులైరి. అనేకచోట్ల గీతాయజ్ఞములను తిరుపతి దేవస్థానం వారే నిర్వహించిరి.

శ్రీ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఇ.ఓ.గారు తిరుపతి కార్యక్రమమును గురించి వివరిస్తూ గీతా ప్రవచనములకు తిరుపతి చరిత్రలో ఇంతమంది భక్తులను ఆకర్షించిన వారు లేరని ప్రశంసించిరి. గీతా ప్రవచనములను ఆడియో క్యాసెట్లుగా తయారు చేయించి అందించిన ఘనత కూడా శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్, ఇ.ఓ. గారికే దక్కినది. నేడు వీడియో సి.డి.లుగా కూడా అందుబాటులోనికి తెచ్చారు. ఒకపుడు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు సంస్కృతి టీ.వీ. ఛానల్ వారు శ్రీవారి ప్రవచనములు ప్రసారం చేసి లక్షలాది మంది భక్తులకు విని ఆనందించే అవకాశం కల్పించారు. ఈ శుభసందర్భంగా వీరికి ప్రత్యేక ధన్యవాదాలు. శ్రీవారి జన్మదిన శుభ సందర్భంగా శ్రీవారిఆశీస్సులు మనందరికి వుండాలని ప్రార్థిస్తూ!

మీ వాక్కులు మదిలోనే వున్నాయి స్వామీ ! మరుపురాని మీ మధురానుభూతులను నెమరువేసుకుంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నాను స్వామీ ! గురుదేవా ! పాహిమాం,పాహిమాం, పాహిమాం. పాహి.

**జై శ్రీరామ - వాసుదేవ. గురువును - పూజిద్దాం**
**గురుబోధను - పాటిద్దాం గురు కృప - పొందుదాం.**

---

సాధకుడు ఏకాంత ప్రదేశానికి వెళ్ళి మనస్సును ఏకాగ్రం చేయడానికి ప్రయత్నించాలి. నిశ్శబ్దమైన హృదయ దేవాలయములో భగవంతుణ్ణి ధ్యానించాలి.

ఎవరి పరితాపం తీవ్రమై వెంటుందో, ఏకాగ్రత గాఢమై వుంటుందో వారు శీఘ్రంగా భగవంతుణ్ణి కాంచగలరు. త్రికరణ శుద్ధిగా ప్రయత్నిస్తే విజయం తప్పక పొందుతారు.

**- శ్రీరామకృష్ణ పరమహంస**



Scanned with CamScanner

# వార్తలు

**(01).** 1-3-2020 తేది కృత్తిక సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి ప్రదోష కాలంలో అభిషేకం అర్చన చేయబడినది. అట్లే 29-03-2020 తేది ఆదివారం నాడు కృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు, అర్చనలు చేయబడినవి.

**(02). 9-3-2020 తేది** సోమవారం తెనాలి అష్టలక్ష్మి పీఠంలో అమ్మవారి జన్మదినోత్సవం పూజ్యశ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారిచే చేయబడింది. అందులో శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొనినారు. పూజ్యశ్రీ దండినిర్మలానందగిరి స్వాములవారు భక్తులకు ఉచితంగా పంచి పెట్టడానికి ముద్రించిన స్థూలాక్షరి తాత్పర్య గీతను ఆవిష్కరించారు.

**(03).** 25-03-2020 తేది బుధవారము ఉగాది శ్రీ శార్వరినామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆశ్రమ శివాలయంలో రుద్రాభిషేకం జరిగినది. బిల్వార్చన జరిగినది. సాయంకాలం వేదపణ్డితులచే చతుర్వేద పారాయణ చేయబడినది. పణ్డితులకు సత్కారం చేయబడినది. బ్రహ్మశ్రీ మారుతీశర్మ గారిచే పంచాంగ శ్రవణం చేయబడినది.

**(4).** ఏప్రియల్ 4వ తేది (4-04-2020) శనివారం చైత్ర శుద్ధ ఏకాదశినాడు సద్గురు మహర్షి మలయాళస్వాములవారి జయన్తి శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరుగును. శ్రీ సద్గురు స్వామీజీవారి దివ్యమూర్తికి షోడశోపచార పూజ జరుపబడును.

**(5).** 7-04-2020 తేది నుండి 5 రోజులు పూజ్యశ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపకులగు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి 22వ ఆరాధనోత్సవాలు జరుగును.

**(06).** ఆశ్రమ కంటి ఆసుపత్రిలో 2020 ఫిబ్రవరి నెలలో ఓ.పి. విభాగంలో **886** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేశారు. **76 మంది** కళ్ళలో పొరలు తీసివేసి లెన్సు అమర్చబడినవి. **3గురికి** యాగ్ లేజర్ చికిత్స జరిగినది.

తెనాలి అష్టలక్ష్మి దేవాలయంలో పూజ్యశ్రీ దండి స్వాములవారితోటి పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు



తెనాలి అష్టలక్ష్మి పీఠాధిపతులు పూజ్యశ్రీ దండిస్వాములవారి భగవద్గీత ఆవిష్కరణ సందర్భంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి ప్రసంగం

Scanned with CamScanner

Regd.No. TRP / 123 / 2018 - 20 April 2020 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-03-2020, Permitted to post : 29th, 30th every month.

ఈ పేజీ స్థల దాతలు

## సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం



Scanned with CamScanner